క్లుప్తంగా

1న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళతో కలిసి ఆవిష్కరించారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, బీ ఫార్మసీ, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం రూ.12వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్: 9440 224291 నంబరును సంప్రదించాలన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణతో మెలగాలని ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల మైదానంలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే ఆడపిల్లలను మధ్యలోనే చదువు మాన్పించకుండా చదివించాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరావు, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

నంద్యాల(న్యూటౌన్): నైతిక విలువలు పెంపొందిస్తూ సమాజంలో బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ధ్యేయమని పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. సోమవారం చెంచుగూడెంలో సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌జీఎంఐఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని విద్యావంతులుగా మారాలన్నారు. శుభ్రత పాటించి మంచి ఆహార అలవాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు ఆహారం, పండ్లు, దుప్పట్లు, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల(వ్యవసాయం): వైద్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందజేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మధుమణి సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన ఐఎంఏ నూతన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వైద్యులపై పెరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైద్యుల రక్షణకు సంబంధించిన చట్టాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైద్యులు వసుధారాణి, విజయభాస్కరరెడ్డి, మధుసూదనరెడ్డి, అనిల్‌కుమార్, ఫణీల్‌కుమార్, నాగమణి, నర్మదా, కల్పనా, అరుణ కుమారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ముచ్చుమర్రిలో మైనర్ బాలిక గ్యాంగ్ రేప్‌నకు కారణమైన వారికి కఠిన శిక్ష విధించాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, సహాయ కార్యదర్శి మదనగోపాల్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణాను ఆయన కార్యాలయంలో బాలిక తల్లిదండ్రులు, ఎంవీఆర్‌పీఎస్ నేతలు కలిశారు. న్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, వెంకటేశ్వర్లు, రవి, శేఖర్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న నాగరాజు


నంద్యాల(న్యూటౌన్): 104 ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 104 సేవలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంట్లు, అరియర్స్ చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. 104లో పని చేస్తున్న డీఈఓలకు వెయిటేజ్ మార్కులు కల్పించి ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కోశాధికారి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రంలో కనిపిస్తున్న ఈ మహిళ పేరు హైరాబీ. దొర్నిపాడు మండలం బుర్రారెడ్డిపల్లెలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటుంది. ఐదు పాడిగేదెలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. ప్రస్తుతం దోమల తాకిడి ఎక్కువ కావడంతో అవి ఇబ్బంది పడుతున్నాయి. రాత్రంతా నిద్రలేకపోవడంతో కొన్ని పాలు సరిగ్గా ఇవ్వకపోగా మరికొన్ని రోగాల బారిన పడుతు న్నాయి. దీంతో రూ.3వేలు వెచ్చించి పాక చుట్టూ దోమతెరను చుట్టి వాటిని కాపాడుకుంటోంది.



పశువుల క్షేమం కోరి!

- ఇటీవల కురిసిన వానలతో తీవ్రమైన దోమల బెడద
- పాడిపశువులను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
- దోమతెరలు, సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాటు


గోస్పాడులో పశువుల పాకలో ఏర్పాటు చేసిన దోమ తెర

గోస్పాడు/దొర్నిపాడు: జిల్లాలో అధికమంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ఇక్కడ మేతకు కరువు ఉండదు. సీజన్‌లో కొందరు రైతులు ప్రత్యేకంగా పచ్చి గడ్డిని సాగు చేస్తుంటారు. అయితే, ఇటీవల జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో పాటు వాతారణంలో చోటు చేసుకున్న మార్పులతో దోమల బెడద ఎక్కువైంది. పశువులను రాత్రిపూట కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఆవులు, ఎద్దులు 2.59 లక్షలు, గేదేలు 3.60 లక్షలు, గొర్రెలు 13.49 లక్షలు ఉన్నాయి. వీటికి దోమలు కుట్టుతుండటంతో వ్యాధులకు గురవుతున్నాయి. పాలిచ్చే పశువులపై ఈ ప్రభావం అధికంగా ఉండటంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. దీంతో దోమల బారి నుంచి వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

పాడిగేదెలు వారికి పసిబిడ్డలే

పాడి రైతులు పశువులను పసిబిడ్డల్లా చూసుకుంటున్నారు. రాత్రి వేళల్లో దోమల తాకిడికి తట్టుకోలేక అవి అల్లాడుతుంటే దోమతెరలు ఏర్పాటు చేసి కాపాడుకుంటున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో రూ.2000 నుంచి రూ.3000 వరకు వెచ్చించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు పాకల్లో సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేస్తుండగా, ఇంకొందరు సాయంత్రం వేళల్లో ఎండు, పచ్చగడ్డితో పొగ వేస్తున్నారు. దోమ కాటు వల్ల పశువులకు జ్వరాలు వచ్చి పాలు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ఇలా చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని, అలాగే రాయితీపై దోమతెరల పంపిణీ చేపట్టాలని కోరుతున్నారు.

దోమలను నివారించాలి



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పల్లెల్లో దోమల ఉధృతి అధికంగా ఉంది. మనుషులతో పాటు పశువులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పశువులను కాపాడుకునేందుకు పాకల చుట్టూ దోమతెరలను వాడుతున్నాం. అయినా దోమల తీవ్రత తగ్గడం లేదు. ఈ సమస్య పశువులు ఇచ్చే పాల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. –వెంకటేశ్వరరెడ్డి, రైతు

గేదెలకు ఆరు గంటలు నిద్ర అవసరం



ముఖ్యంగా పాడిగేదెలకు ప్రతి రోజు రాత్రి 6 గంటలు నిద్ర అవసరం. ప్రస్తుతం దోమలు కుట్టటం వల్ల అవి నిద్రలేక తిన్న ఆహారం నెమరు వేయక పోవడంతో పాల ఉత్పత్తి అమాతంగా తగ్గిపోయే అవకాశం ఉంది. రోజు ఆరు లీటర్లు పాలు ఇచ్చే గేదె ఒకటి, రెండు లీటర్లకంటే ఎక్కువ ఇవ్వదు. కనుక దోమతెరలు వాడటం ఉత్తమం. దోమల కుట్టడం ద్వారా రక్తస్రావం జరగడం, వైరస్, బ్యాక్టీరియా వంటివి చేరడం వల్ల రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దోమతెరలు లేనివారు కనీసం ఫ్యాన్ ఏర్పాటు చేసినా ఫలితం ఉంటుంది. దీంతో పాటు పశువుల పాకలో శుభ్రత పాటించకపోయినా దోమలు పెరిగే అవకాశం ఉంది. పాకలో వెచ్చని వాతావరణం ఉండేలా చూసుకోవాలి. – పుల్లయ్య, పశువైద్యాధికారి, దబ్ల్యూకొత్తపల్లె, దొర్నిపాడు

ఆధ్యాత్మికం

నంద్యాలకు చేరుకున్న శ్రీరామయంత్రం

నంద్యాల(వ్యవసాయం): కంచికామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్రసరస్వతి ఆధ్వర్యంలో అయోధ్య భవ్యరామ మందిరంలో ప్రతిష్టింపదలచిన శ్రీరామయంత్రం సోమవారం నంద్యాలకు చేరుకుంది. స్థానిక శ్రీప్రథమనంది దేవస్థానంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడు మురళీకృష్ణారావు మాట్లాడుతూ ఈ యంత్రాన్ని తిరుపతిలోని కంచి పీఠం నుంచి ప్రత్యేక రథంలో అయోధ్యకు తరలిస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల తర్వాత అక్కడికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సేవా సమాఖ్య సభ్యులు సీతారామశర్మ, కేశవమూర్తి, సుధీంద్రాచార్యులు, కార్తికేయశర్మ, ప్రశాంతి, కాదంబిని తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామ యంత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు

అవీ-ఇవీ

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): సాంఘిక సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రుడు కోరారు. సోమవారం ఆయన సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణిని కలిసి పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాంబాబు, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతి

ఉయ్యాలవాడ : ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని తహసీల్దార్ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నర్సిపల్లె, హరివరం గ్రామాల నుంచి పలువురు జనన, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు కోసం తహసీల్దార్‌కు అర్జీలు సమర్పించారు.

వాహనం ఏర్పాటు చేయండి

నంద్యాల(వ్యవసాయం): నేత్రదాన అవగాహన సదస్సులకు వాహనం ఏర్పాటు చేయాలని సోమవారం ఎంపీ బైరెడ్డి శబరికి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, ఆయుష్ యోగా సేవా సమితి కండే ఆనంద్ గురూజీ కలిసి విన్నవించారు. జిల్లాలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు, నేత్ర, వైద్య శిబిరాలకు ఎంపీ నిధుల కింద వాహనం మంజూరు చేయాలన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్ఐ వెంకటేష్

ఆళ్లగడ్డ: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్‌హాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. మొదట డీఎస్పీ రవికుమార్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసు సిబ్బంది, అధికారులు, స్థానిక యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అంతకు ముందు డీఎస్పీ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐలు చిరంజీవి, కంబగిరిరాముడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

యువకులకు అభినందనలు

దొర్నిపాడు: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం దొర్నిపాడుకు చెందిన పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ వారిని అభినందించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల మన ఆరోగ్యం బాగుండటంతో పాటు మరో నిండు ప్రాణాలకు ఆయువు పోసిన వారమవుతామన్నారు. కావునా ప్రతి యువకుడు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

సాగు నీటి సంఘాల ఎన్నికకు సన్నద్ధం

ఉయ్యాలవాడ : సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఓటర్ల జాబితా సేకరణలో వారు బీజీ అయ్యారు. మండల పరిధిలో కేసీ కాలువ, ఎస్సార్బీసీ, చెరువుల కింద సాగులో ఉన్న ఆయకట్టు భూముల విస్తీర్ణం, రైతుల వివరాలను నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఒక డబ్ల్యూఏ (టీసీ) కింద 6 మంది సభ్యులు ఉంటారు. వీరిని గత 2015లో జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. వీరు 2019 వరకు కొనసాగారు. అప్పట్లో ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో రైతులు చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. వాటి కాలపరిమితి ముగియడంతో మళ్లీ ఇప్పటి దాకా ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం సాగు నీటి సంఘాల ఎన్నికలు ఈ ఏడాది నవంబర్ నెలలో నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఉయ్యాలవాడ మండల పరిధిలో కేసీ కాలువ పరిధిలో 42 టీసీ కింద హరివరం, 43 సుద్దమల్ల, పడిగెపాడు, 48 సర్వాయిపల్లె, 49 ఇంజేడు, ఉయ్యాలవాడ, 52 పెద్దయమ్మనూరు,ఆర్.జంబులదిన్నె గ్రామాల రైతులు ఓటర్లుగా ఉంటారు. ఎస్సార్బీసీ కాలువల పరిధిలో 33 టీసీ కింద నర్సిపల్లె, 35 ఉయ్యాలవాడ, 46 తుడుమలదిన్నె, 48 అల్లూరు, 45,49 టీసీల కింద మాయలూరు, తుడుమలదిన్నె గ్రామాల రైతులు, రూపనగుడి, తుడుమలదిన్నె రెండు చెరువుల కింద ఉయ్యాలవాడ, రూపనగుడి, మాయలూరు, తుడుమలదిన్నె గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉంటారు. కాగా ఎన్నికలు ప్రత్యక్షంగా చేతులు ఎత్తే విధానంలోనా లేక రహస్య పద్ధతిలోనా అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌బాబు తెలిపారు.

రైతులకు పరిహారం అందేలా చూస్తాం


చిన్నకంబలూరు వద్ద కల్తీవిత్తనాలతో సాగు చేసిన వరిపైరును పరిశీలిస్తున్న దృశ్యం

రుద్రవరం: కల్తీ విత్తనాలతో వరి సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మండల ఇన్‌చార్జ్ ఏఓ సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని చిన్నకంబలూరుకు చెందిన 51 మంది రైతులు నంద్యాలలోని ఓ సీడ్ దుకాణం నుంచి విత్తనాలు కొనుగోలు చేసి 961 ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే పంట సరిగ్గా లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ ఏఓ.. సిబ్బందితో కలిసి వరి పొలాలను పరిశీలించారు. తదుపరి చర్యల నిమిత్తం క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది చాణిక్యుడు తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్

చెస్, వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): వాలీబాల్, చెస్ పోటీల్లో రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు శ్రీరామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే చెస్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచారు. విజేత క్రీడాకారులకు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత, డైరెక్టర్లు ట్రోఫీతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచితంగా ఏడాదికి 3 సిలిండర్లు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి ఉచితంగా 3 సిలిండర్లు అందజేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సోమవారం తెలిపారు. ఈ పథకం కింద అర్హత పొందాలంటే గ్యాస్ కనెక్షన్ ఉండాలన్నారు. దీనికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు అనుసంధానం అయి ఉండాలన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి గ్యాస్‌సిలిండర్ బుకింగ్ చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ముందుగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. సిలిండర్ డోర్ డెలివరి అయిన 48గంటల్లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు. మార్చి వరకు గ్యాస్ ఏజెన్సీల వద్ద మొదటి సిలిండర్ కోసం బుక్ చేసుకోవచ్చన్నారు. నాలుగు మాసాలకు ఒక సిలిండర్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి జూలై 25లోపు ఒక సిలిండర్, ఆగస్టు 2025 నుంచి నవంబర్ 2025లోపు మరో సిలిండర్, డిసెంబర్ 2025 నుంచి మార్చి 2026లోపు ఇంకో సిలిండర్ ఇస్తామన్నారు.

మున్సిపల్ ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేసి, ఆస్తులు ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఐ, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించండి


మాట్లాడుతున్న యూఎన్‌డీపీ ప్రతినిధి రుషి పంత్

నంద్యాల: జిల్లాలో జీవ వైవిధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఇది అదర్ ఎఫెక్టివ్ ఏరియా బేస్ట్ కన్జర్వేషన్ మెజర్స్ ప్రధాన ఉద్దేశమని యూఎన్‌డీపీ ప్రతినిధి రుషి పంత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యూఎన్‌డీపీ బృందం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, పరిశ్రమలు, డీఆర్‌డీఏ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రిలిమినరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎన్‌డీపీఏ ప్రతినిధి మాట్లాడుతూ జిల్లాలో అటవీ ప్రాంతాలు, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు ఇతర ప్రభావంతమైన ప్రాంత జీవ వైవిధ్య పరిరక్షణకు స్థానికంగా ఉన్న జీవ వనరులను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధిత అధికారులు, జిల్లా యంత్రాంగం సహకారం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ యూఎన్‌డీపీ బృంద సభ్యులకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అధికారులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం


ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆర్వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఆళ్లగడ్డ ఐదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు ఆర్వీవీఎస్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు.. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు.. అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేసులు వాదించేందుకు మీకు న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కావాలంటే లోక్ అదాలత్ ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా న్యాయ సేవల గురించి తెలుసుకోవాలంటే 15100 కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి శల్వంత్, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు

క్రైం కార్నర్

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

కోవెలకుంట్ల: తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామానికి చెందిన మంగలిరాజు(32)కు చిన్నతనంలో తల్లిదండ్రులు మృతిచెందారు. ఇదే గ్రామంలో ఉంటున్న బంధువులు రాజును పెంచి పెద్దచేశారు. తల్లిదండ్రులతోపాటు తనకంటూ రక్త సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం కోవెలకుంట్లకు వచ్చి అతిగా మద్యం సేవించాడు. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పడిపోయాడు. రాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో దాహంతో గొంతు ఎండిపోయి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతని బంధువులకు సమాచారం చేరవేసి మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు గ్రామం వద్ద సోమవారం మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడి ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం గోపవరం గ్రామానికి చెందిన మురళీ మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట గుర్రప్ప స్వామి ఆలయం వద్ద ఓ శుభకార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తున్నాడు. చిన్నకంబలూరు గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వెదురు బొంగులు స్వాధీనం

రుద్రవరం: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 200 వెదురు బొంగుల ను స్వాధీనం చేసుకున్నట్లు రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు సోమవారం రాత్రి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అహోబిలం అడవుల్లో నుంచి వెదుర్లను సేకరించి ఆళ్లగడ్డ వైపు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడి సిబ్బందిని పురమాయించి దాడి చేయించామన్నారు. పట్టుబడిన బొంగులను అహోబిలం అటవీ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయిస్తున్న శ్రీనాథ్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న శ్రీనాథ్‌గౌడ్‌ను వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి సిబ్బంది సహాయంతో నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 31టెట్రా మద్యం ప్యాకెట్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

శిరివెళ్ల: జీనేపల్లెకు చెందిన సారా విక్రేత నల్లారెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న మల్లయ్య తెలిపారు. నిందితుడు యర్రగుంట్ల వైన్ షాపు నుంచి 20 మద్యం బాటిళ్లను తన స్వగ్రామంలో అమ్ముకుందుకు తీసుకెళ్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామ మాజీ సర్పంచ్ గాండ్ల నాగేషయ్య(76) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 2007లో గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించారు. గాండ్ల నాగేషయ్య మృతి విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామ మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్టారెడ్డి, ఉప సర్పంచ్ బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ గ్రామ ఉప సర్పంచ్ కూలూరు రామక్రిష్టారెడ్డి, తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. ఈయనకు భార్య నాగరత్నమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


పల్లె నిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ

దొర్నిపాడు: బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు.సోమవారం రాత్రి మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాఠశాలలు, ఆలయాలు, దర్గాల వద్ద మద్యం తాగితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే ప్రతి వాహన దారుడు హెల్మెట్ వాడాలని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.అనంతరం గ్రామస్తులు పుల్లరి పొలాలకు వెళ్లేందుకు రహదారి సమస్య ఉందని పరిష్కరించాలని ఎస్ఐ దృష్టికి తీసుకువచ్చారు. సీఐతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు

గోస్పాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే 43 మంది ఇంటర్ విద్యార్థులకు దాతల సహకారంతో పబ్లిక్ పరీక్ష ఫీజును చెల్లించినట్లు ప్రిన్సిపాల్ బాలచంద్రుడు తెలిపారు. మండలంలోని దీబగుంట్ల జూనియర్ కళాశాలలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యాభ్యాసం చేసే మొదటి, రెండో సంవత్సరానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు వాయిస్ సంస్థ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ సహకారంతో 15మంది విద్యార్థులకు రూ.10వేలు, దీబగుంట్ల ఏపీజీబీ శాఖ మేనేజర్ సుదీర్, ఫీల్డ్ ఆఫీసర్ గోవిందరెడ్డి 10మందికి రూ.7425, బెస్త సంఘం సహకారంతో 9 మందికి రూ.5,400, సునీత ఒకేషనల్ కరస్పాండెంట్ కిరణ్ సహకారంతో 8మంది విద్యార్థులకు రూ.5వేలు విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజులను చెల్లించారు. అనంతరం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరు శాతం, పరీక్షల్లో చూపిన ప్రతిభకు సంబంధించిన ప్రోగ్రెస్‌ను అందించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, వక్తలు పాల్గొన్నారు.